
సాక్షి నంద్యాల

శుక్రవారం ၊ 6 ၊ డిసెంబర్ ၊ 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన విజయ లక్ష్మి బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



దీక్షా..దక్షత

అయ్యప్ప భక్తులు దీక్షా సమయంలో పాటించే నియమాలను దీక్షానంతరం కూడా పాటిస్తే ఆరోగ్యంతోపాటు వ్యక్తిత్వ వికాసంతో ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుంది.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.51
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:92.238
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,332
అవుట్ ఫ్లో	:5,254

న్యూస్‌రీల్

శ్రీశైలం ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా ఎం.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు ఈఓకు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఎం.శ్రీనివాసరావు ఆయన మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. స్వామిఅమ్మవార్ల కృప, అందరి సహకారంతో శ్రీశైలక్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. భక్తులకు తగిన వసతి, సౌకర్యవంతమైన దర్శనం, అన్నప్రసాద వితరణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానన్నారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

● డీఈఓ జనార్దన్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

పాణ్యం: సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని నెరవాడ మెట్ట వద్ద బీసీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్య ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నాయని, ప్రణాళికలు వేసుకుని సిలబస్‌ను పూర్తిగా చదువుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డార్మెటరీతోపాటు కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. స్టాక్ రూమ్‌లో ఉన్న బియ్యం, సరుకులను, కూరగాయాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈనెల 7న నిర్వహించనున్న పేరెంట్స్ మీటింగ్‌పై ప్రిన్సిపాల్ ప్లోరమ్మకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

హెచ్‌సీలుగా పదోన్నతి

కర్నూలు: పోలీసు శాఖ ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 8 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ బిందు మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న స్థానాల నుంచి నంద్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కె.నీలకంఠ, ఎన్.నాగేంద్ర, కె.రవీంద్రుడు, సి.శ్రీనివాసులు, జి.సుధాకర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, ఎస్.మహమ్మద్ అలీ, డి.సంజీవ రాయుడు తదితరులు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాలో పనిచేస్తున్నవారు ముగ్గురు, నంద్యాల జిల్లాలో పనిచేస్తున్నవారు ఐదుగురు ఉన్నారు. వీరందరికీ బదిలీల్లో భాగంగా స్థాన చలనం కలిగింది.

దంచికొట్టిన వాన

కొత్తపల్లి: మండలంలో గురువారం సాయంత్రం ఉన్నట్టుండి వర్షం దంచికొట్టింది. గువ్వలకుంట్ల వీరాపురం, నందికుంట, బావాపురం, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె గ్రామాలతో పాటు మండల కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. కాగా కోతలు కోసి ఆరబెట్టుకున్న వరి దిగుబడులు వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీశైలం నుంచి 9,821 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి బుధవారం నుంచి గురువారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు 9,821 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు కేంద్రంలో 2.682 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నాగార్జునసాగర్‌కు 6,037 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,484, కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 1.80 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సెల్ఫ్ క్యాచ్‌మెంట్‌లో కురిసిన వర్షాల కారణంగా జలాశయంలోకి 136 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. గురువారం సాయంత్రానికి జలాశయంలో 119.1976 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 864.10 అడుగులకు చేరుకుంది.



ఇతని పేరు వీరభద్రుడు. బేతంచెర్లలో 14 ఏళ్లుగా వస్త్ర, గార్మెంట్స్ దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనతోపాటు కొడుకు, ఇద్దరు వర్కర్లను పెట్టుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గతంలో నెలకు రూ.3 లక్షల దాకా వ్యాపారం జరిగేది. ప్రస్తుతం రూ.లక్ష కూడా కావడం లేదు. దీంతో షాపుల బాడుగ, వర్కర్ల జీతాలు ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యాపారం మానుకోవాల్సి వస్తుందని వీరభద్రుడు పెదవి విరిచారు.

వీరిద్దరే కాదు మార్కెట్‌లో ఏ ఒక్కరిని కదిలించినా వారి బాధలు పెద్దగా చెబుతున్నారు. ఒక వైపు వ్యాపారాలు జరగక దుకాణాల అద్దెలు చెల్లించలేక పోతున్నారు. వర్కర్స్‌కు జీతాలు ఇవ్వలేక వారిని మాన్పించి వేస్తున్నారు. ఇంటి వారే తలా ఒక పని చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్కెట్‌లో అనేక వ్యాపారాలు పడిపోయాయి. గత సంవత్సరంతో పోలిస్తే 40 శాతానికి పైగా బిజినెస్ తగ్గిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.



ప్యాపిలి మండలం పీఆర్ పల్లి గ్రామానికి చెందిన ఇతని పేరు వెంకటరాముడు. కొన్నేళ్లుగా హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుకు రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు వ్యాపారం జరిగేది. ఖర్చులు పోనూ అంతో ఇంతో మిగిలేది. కానీ ఇటీవల నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెట్టుబడులు కూడా రావడం లేదని వెంకటరాముడు వాపోయాడు. అలవాటైన వ్యాపారం కాబట్టి మానుకోలేక అలాగే కొనసాగిస్తున్నామని చెప్పారు.

వ్యాపారం భారమాయె..!

- పడకేసిన బిజినెస్‌లు
- రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కుదేల్
- పెరిగిన ధరలతో తగ్గిన కొనుగోలు శక్తి
- పథకాల లేమితో ప్రజల్లో డబ్బు కొరత
- అత్యవసరం ఉంటేనే ఏ వస్తువైనా కొనుగోలు



కర్నూలు(హాస్పిటల్)/నంద్యాల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 వేల మంది వివిధ ట్రేడ్‌ల వ్యాపారులు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వస్తుసేవలకు సంబంధించి వసూలు చేసే పన్నులను ఈ శాఖ వసూలు చేస్తుంది. దీనినే జీఎస్టీ అంటారు. ఇలా వసూలు చేసిన పన్నులో సగం కేంద్రానికి, సగం రాష్ట్రానికి చెందుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకు వివిధ పథకాల రూపేణా డబ్బు చేరుతుండేది. వారు వివిధ వస్తువు కొనుగోలు చేయడంతో మార్కెట్‌లోకి డబ్బు వచ్చేది. ఇలా ఒకరి నుంచి మరొకరికి విరివిగా డబ్బు మారడం వల్ల ప్రభుత్వానికి పన్నుల రూపేణా బాగా ఆదాయం సమకూరేది. ఈ ఏడాది మార్చి వరకు జీఎస్టీ వసూళ్లు బాగానే వచ్చాయి. ఆ తర్వాత ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలు వ్యాపారాలు స్తబ్దుగా మారాయి. ఎన్నికల ఫలితాల అనంతరం సైతం ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరంతో పోలిస్తే గత ఆరు నెలల కాలంలో జీఎస్టీ వసూళ్లు 40 శాతం పడిపోయినట్లు సమాచారం. కర్నూలు, నంద్యాలతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ లాంటి ప్రాంతాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూములు, ప్లాట్లు, ఫ్లాట్లు, వ్యవసాయ భూముల క్రయ విక్రయాలు బాగా జరిగేవి. గతంలో కర్నూలు లాంటి ప్రాంతంలో రోజుకు వివిధ రకాల రిజిస్ట్రేషన్లు 150 దాకా జరిగేవి. ప్రస్తుత ప్రభుత్వంలో 80 కూడా జరగడం లేదని డాక్యుమెంట్ రైటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూములు, ఇళ్లు, ఫ్లాట్ల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలు పూర్తిగా తగ్గిపోయాయి. కొనడానికి ఎవ్వరూ రాకపోవడంతో కర్నూలు, నంద్యాలలోని శివారు ప్రాంతాలు, డోన్, ఆళ్లగడ్డ, ఆదోని లాంటి ప్రాంతాల్లో ధరలు తగ్గించి మరీ విక్రయిస్తున్నారు.

పడిపోయిన వ్యాపారాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో నిర్మాణ రంగం కుదేలైపోయింది. ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రకటించిన ఈ ప్రభుత్వంలో వాటి ధరలు ఆకాశాన్నంటాయి. దీనికి తోడు ఇసుక ఎక్కడా లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ కారణంగా సిమెంట్, స్టీలు వ్యాపారాలు తగ్గిపోయాయి. నిర్మాణాలకు అనుబంధంగా ఉన్న ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ వ్యాపారాలూ మందగించాయి. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో ఎలక్ట్రానిక్ వస్తువులైన టీవీలు, మొబైల్ ఫోన్లు కొనడం తగ్గింది. గృహోపకరణాలైన మిక్సీలు, కుక్కర్లు, ఐరన్‌బాక్స్‌లు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్లను అత్యవసరమైతే తప్పడం కొనడం లేదు.

మార్కెట్‌లో ఇదీ పరిస్థితి

- ➤ ఇసుక అధిక ధరలు, సమయానికి దొరకకపోవడం వల్ల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీనివల్ల సిమెంటు, స్టీలు వ్యాపారాలు పూర్తిగా మందగించాయి.
- ➤ ప్రభుత్వం 22ఏ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం, టీడీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులను మామూళ్ల కోసం వేధించడంతో ఆ రంగం పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో కర్నూలు జిల్లాలో గతంలో రోజుకు 160 వరకు డాక్యుమెంట్లు జరిగేవి. ప్రస్తుతం 80కు మించి డాక్యుమెంట్లు జరగడం లేదు. దీంతో నగదు రొటేషన్ మందగించింది.
- ➤ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ సిస్టమ్ ద్వారా నగదు బదిలీ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందడం వల్ల కొనుగోళ్లు పెరిగేవి. ఆ పథకాలు ఆగిపోవడం వల్ల వ్యాపారాలపై ప్రభావం పడింది. ఈ క్రమంలో కర్నూలు కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న స్పెన్సర్స్ షాపింగ్ మాల్ మూతపడగా, ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఒకటిగా ఉన్న రిలయన్స్ మార్ట్ మూడు కౌంటర్లు (అనంత కాంప్లెక్స్, నంద్యాల చెక్‌పోస్టు, నరసింహారెడ్డి నగర్) మూతపడ్డాయి.
- ➤ కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలో అధిక శాతం మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల కూడా వ్యాపారాలు మందగించాయి.
- ➤ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, వ్యాపార వ్యతిరేక విధానాలతో ఆదోనిలో జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, వంట నూనెల పరిశ్రమలు మూతబడి వేలాది మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు.

“ బట్టల బిజినెస్ బాగా తగ్గిపోయింది



ఇటీవల కాలంలో మార్కెట్‌లో అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో బిజినెస్ తగ్గిపోయింది. ప్రజలు అవసరముంటేనే ఏదైనా వస్తువు కొనే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిల్లో కేవలం పండుగలప్పుడు మాత్రమే బట్టలు కొంటున్నారు. అది కూడా ఇప్పుడు యువతీ, యువకులు మోడ్రన్ డ్రస్స్‌లను కొనాలంటే ఆన్‌లైన్లో యాప్‌ల ద్వారా సెలెక్టు చేసు కుంటారు. లేదాషాపులకు వెళ్లకుండానే యజమానులకు వీడియో కాల్ చేసి ఎంపిక చేసుకుని నగదు బదిలీలను పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే డిజిటల్ ద్వారా విక్రయాలు కొన సాగిస్తున్నారు. దీంతో మా లాంటి వ్యాపారా లావాదేవీలు బాగా తగ్గిపోయాయి. – బుదారాపు మల్లికార్జున, ఆలూరు సిల్క్, బనారస్ క్లాత్ మర్చెంట్, ఆలూరు

ఎరువుల వ్యాపారాలు పడిపోయాయి



ఈ ఖరీఫ్‌లో మా ఎరువుల దుకాణాల వ్యాపారాలు 50 శాతం తగ్గిపోయాయి. కారణం గత ఖరీఫ్‌లో రైతులు రైతు భరోసా ద్వారా ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడిని పొందేవారు. ఆ డబ్బులు ప్రస్తుతం రైతులకు రాకపోవడంతో పెట్టుబడులకు పెట్టుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల 10 సంచుల ఎరువులను కొనే రైతు తమ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐదు సంచులు ఎరువులను మాత్రమే కొనుగోలు చేస్తున్నాడు. అలాగే పెస్టిసైడ్స్ పురుగుల మందులు సైతం 50 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో మా వ్యాపారాలు బాగా తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నాం. – చిన్న నరసింహులు, ఎరువుల దుకాణవ్యాపారి, ఆదోని

ప్రభుత్వ ప్రోత్సాహం కావాలి



రాజస్తాన్ మార్బుల్ పోటీని తట్టుకోవాలంటే బేతంచెర్ల నాపరాయికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించడమే గాకుండా తప్పనిసరిగా ప్రభుత్వ కార్యాలయాల్లో విరివిగా వాడుకునేలా నిబంధన పెట్టాలి. లేకపోతే బేతంచెర్ల నాపరాయి పరిశ్రమ రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంది. గతంలో నెలకు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల దాకా నాపరాయి రాళ్ల వ్యాపారం జరిగేది. ప్రస్తుతం నెలకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు మించడం లేదు. రవాణా, కూలీలు, విద్యుత్ చార్జీలకే సరిపోతుండటంతో పరిశ్రమల నిర్వహణ భారంగా ఉంది. – రిజ్వానుల్లాఖాద్రి, పరిశ్రమ యజమాని, బేతంచెర్ల

సమష్టి కృషితోనే సుస్థిర అభివృద్ధి

● జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమని జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జీ నాసరరెడ్డి అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై కర్నూలు, నంద్యాల జిల్లాల బ్లాక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా కార్యక్రమాలు గురువారం స్థానిక డీపీఆర్‌సీ భవనంలో ప్రారంభమయ్యాయి. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాసరరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రతి గ్రామం సుభిక్షంగా, పరిశుభ్రంగా ఉండాలన్నదే శిక్షణ ఉద్దేశమన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులను కల్పించడం, ప్రజల ఆరోగ్యం, సురక్షితమైన నీటిని అందించడం ఇందులో భాగమేనన్నారు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలను కల్పించడం, సామాజిక భద్రత తదితర తొమ్మిది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు సుస్థిర లక్ష్యాలను సాధించేందుకు చర్యలను తీసుకోవాలని, బీఎల్ఎంటీలు తమ పరిధిలోని సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, లైన్ డిపార్టుమెంట్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ పరిశీలకులు వెంకటరత్నం, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ మంజులావాణి, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, డీఎల్ఎంటీలు సురేష్, వసంత్, దస్తగిరి బాషా, జగన్నాథం పాల్గొన్నారు.

మార్కెట్‌కు తగ్గిన పంట ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోయాయి. రైతులు 13 రకాల పంటలను మార్కెట్‌కు తెస్తారు. అన్ని పంటలు కలిపి 900 క్వింటాళ్ల వరకే వస్తున్నాయి. నవంబరు మొదటి వారంలో 12 వేల క్వింటాళ్లకు పైగా ఉల్లి దిగుబడులు వచ్చాయి. అక్టోబరులో రికార్డు స్థాయిలో 27 వేల క్వింటాళ్లు వచ్చాయి. గురువారం కేవలం 227 క్వింటాళ్లు మాత్రమే రైతుల తెచ్చారు. ఉల్లికి కనిష్ట ధర రూ.1,719, గరిష్ట ధర రూ.4319 లభించింది. సగటు ధర రూ.3,309 నమోదైంది. 164 క్వింటాళ్ల మిర్చి రాగా కనిష్ట ధర రూ.1,999, గరిష్ట ధర రూ.15,213 లభించింది. సగటు ధర రూ.12,513 లభించింది. వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, సజ్జలు, మినుములు, మొక్కజొన్న తదితర పంటలు అంతంతమాత్రమే వస్తున్నాయి. రానున్న రోజుల్లో మార్కెట్‌కు పంట ఉత్పత్తులు మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కొనుగోలు కేంద్రాలు కుదింపు

● కందుల కొనుగోలుకు 25 సెంటర్లకు మాత్రమే అనుమతి

కర్నూలు(అగ్రికల్చర్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూటమి ప్రభుత్వం కుదించింది. 2023–24 వరకు రైతుభరోసా కేంద్రం వారీగా పంటలను కొనుగోలు చేయడం జరిగేది. మద్దతు ధరతోనైనా, మార్కెట్ ధరతోనైనా పంటలను కొనుగోలు చేయడానికి ఆర్‌బీకే వారీగా సెంటర్లు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండింది. గ్రామస్థాయిలోని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. తాజా మార్కెట్ ధరకు అనుగుణంగా కందుల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ 25 సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేసింది. దీనిపై రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. మార్కెట్ ధరతో అమ్మకోవాలంటే పండించిన పంటలను వ్యయ, ప్రయాసాలకోర్చి సుదూర ప్రాంతంలోని సెంటర్‌కు తీసుకెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పండించిన 53 వేల టన్నుల కందులను బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేయడానికి నాఫెడ్ జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. కందుల కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా 25 సెంటర్లను మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో 62270 హెక్టార్లలో కంది సాగు అయింది. ఇప్పుడిప్పుడే కంది కోతలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కందల ధర ఎక్కువగా ఉన్నందున భవిష్యత్ అవసరాల కోసం నాఫెడ్ బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా రైతుల నుంచి కందులను కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ఎంపిక చేసింది. ప్రస్తుతం కందులు పండించిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. కందులు మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత కొనుగోలు ప్రక్రియను మార్క్‌ఫెడ్ శ్రీకారం చుట్టనుంది.



రోడ్డుపై బైఠాయించిన రైతులు, సీఐటీయూ నాయకులు

వరి రైతులు రోడ్డెక్కారు

బండి ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ రైతులు రోడ్డెక్కారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు వెంకటకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులుతో కలిసి రైతులు సంతజూటూరు గ్రామంలో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు ఏటా 25 శాతం పెరిగిపోతుంటే, తాము పండించిన ధాన్యానికి ధరలు తగ్గటానికి కారణం ప్రభుత్వాలేనని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ధర్నాతో రహదారికిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జగన్‌మోహన్ అక్కడికి చేరుకుని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ దాస్‌తో ఫోన్‌లో రైతు సంఘం నాయకులతో మాట్లాడించారు. ఆయన రైతుల సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించడంతో ధర్నా విరమించారు.

సంబరంగా పేరెంట్స్ మీటింగ్

● జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్‌లను సంబరంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్ – టీచర్ సమావేశాలకు ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థు లు, పుర ప్రముఖులు, గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆహ్వానితులేనన్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలతో ఇప్పటికే ప్రతిఒక్కరినీ ఆహ్వానించామన్నారు. ఆటలపోటీలు, క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి విజేతలకు సమావేశాల్లో బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. చివరిగా హాజరైన ప్రతి ఒక్కరికీ శుభదిన్ భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అభిమానులు తగ్గేదేలే!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పుష్ప–2 ఫైల్డ్ మానియా
- థియేటర్ల వద్ద బన్నీ ఫ్యాన్స్ హంగామా
- ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కటౌట్‌కు పాలాభిషేకాలు, గజమాలలు
- ఫ్యాన్స్ ఖుషీ..ఖుషీ
- అంతటా గంగమ్మ జాతర సన్నివేశాలపై చర్చ



నంద్యాలలోని రామ్‌నాథ్ థియేటర్ వద్ద బాణ సంచా కాల్చుతున్న అభిమానులు, (ఇన్‌సెట్‌లో) పుష్ప సినిమాలో అల్లుఅర్జున్ చీర గెటప్‌లో నంద్యాల అభిమాని

నంద్యాల: పుష్ప.. పుష్ప.. పుష్ప.. పుష్ప.. ఇది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వినిపిస్తున్న పదం. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప–2 సినిమా వైల్డ్ మానియాగా మారింది. బుధవారం రాత్రి 9.30 గంటలకు సినిమా విడుదలను అభిమానులు వినూత్నంగా సెలబ్రేట్ చేసుకున్నారు. రాత్రి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 థియేటర్లు, 10 మల్టీ ఫ్లెక్స్‌ల్లో సినిమా ప్రదర్శించారు. బన్నీ ఫ్యాన్స్ ఆటోలకు అల్లూ అర్జున్ కటౌట్‌లతో వారివారి కాలనీల్లో వీధుల్లో బాణా సంచా కాలుస్తూ డీజేలు, డప్పులు వాయిద్యాలతో సందడి చేశారు. థియేటర్ల వద్ద అల్లు అర్జున్ కటౌట్‌లకు పాలాభిషేకాలు చేశారు. భారీ నిమ్మకాయల దండలు, గజ మాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి వేశారు. బేతంచర్లలోని వెంకటేశ్వర థియేటర్ వద్ద పొట్టేల్‌ను బలిచ్చి ఆ రక్తంతో అభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. నంద్యాలలో ఓ అభిమాని అల్లుఅర్జున్ చీరగెటప్ వేసుకొని పుష్ప–2 డైలాగులు చెబుతూ పలువురిని అలరించారు. అభిమానులు కర్నూలు, నంద్యాలకు వచ్చి లాడ్జీల్లో గదులు అద్దెకు తీసుకొని మల్టీప్లెక్స్‌ల్లో సినిమాను వీక్షిస్తూ రచ్చరచ్చ చేశారు. సినిమా పాజిటివ్ టాక్ రావడం, రాయలసీమలో 900 ఏళ్ల చరిత్రతో ప్రసిద్ధి చెందిన గంగమ్మ జాతరను హైలెట్ చేయడంతో ఈ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గంగమ్మ జాతరను పుష్ప–2 సినిమా ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలియజేశారంటూ టీస్టాల్స్, హోటల్స్ వద్ద చర్చించుకోవడం కనిపించింది. ఇదే ఊపు కొనసాగుతుందంటూ, రికార్డులు బద్దలు అవుతున్నాయంటూ అభిమానులు రచ్చరచ్చ చేయడంతో కోలాహలం నెలకొంది. యాగంటి క్షేత్రంలోని వెంకటేశ్వర స్వామి గుహల వద్ద ఓ సన్నివేశం వచ్చినప్పుడు ప్రేక్షకులు గుర్తించి ఆనందం వ్యక్తం చేశారు. పుష్ప–2 సీన్‌లను, బన్ని ఎంట్రీతో పాటు ఫీలింగ్స్ వస్తున్నాయ్.. కిస్సిక్ వంటి పాటలపై ఎక్కడ చూసినా చర్చించుకుంటున్నారు. నంద్యాలలో అభిమానులతో కలసి థియేటర్‌లో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి సినిమాను వీక్షించారు.



సినిమా వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్

క్లుప్తంగా

ఓంకార దేవస్థాన ప్రధాన అర్చకుడి మృతి


సుధాకర శర్మ (ఫైల్)

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకారం దేవస్థాన ప్రధాన అర్చకులు సుధాకర శర్మ (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు బుధవారం కర్నూలులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించగా కోలుకోలేక మృతి చెందారు. ఆయనకు భార్య సుగుణకుమారి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొమ్మలసత్రం: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించినట్లు ఎస్పీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంవీ యాక్ట్ కింద నిబంధనలు ఉల్లంఘించిన 910 మందిపై కేసులు నమోదు చేసి రూ.5,08,395 జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 37 మందిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు వివరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఓవర్ స్పీడ్‌తో వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

పెట్రోల్‌కు డబ్బులివ్వలేదని ఆత్మహత్య


మృతుడు సాకరే ఆకాష్

ఆదోని సెంట్రల్: బైక్‌కు పెట్రోల్ వేసుకునేందుకు ఇంట్లో డబ్బులివ్వలేదని ఆదోని పట్టణం కిల్చిన్‌పేటకు చెందిన ఎస్.రాఘవేంద్ర కుమారుడు ఎస్.ఆకాష్ (20) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఆదోని–ఇస్వి ఆర్ఎస్‌ల మధ్యలో కిలోమీటరు నంబర్ 496/16–18 డౌన్ లైన్ ట్రాక్ మధ్యలో ట్రైన్ నంబర్ 17307 ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఘటనపై లోకో పైలట్ తమకు సమాచారం అందించినట్లు చెప్పారు. బైక్‌కు పెట్రోల్ వేసుకోవడానికి రూ.500 అడిగితే తల్లి ఇవ్వలేదని క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు..


భారతి (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో నివాసముంటున్న శివప్రకాష్ భార్య భారతి (45) గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై వన్‌టౌన్ ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. భారతి ఆలూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె గత మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం ఇంట్లో మేడపై ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. బంధువులు కిందకు దించి ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి బిహార్ వాసి మృతి


మృతిచెందిన సాహేల్ అన్సారి

ఓర్వకల్లు: మండల పరిధిలోని గుడుంబాయి తండా వద్ద గల కొమ్మ చెరువులో బిహార్ వాసి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రంలోని శివార్ జిల్లా బీరా బంకత్ గ్రామానికి చెందిన సొహేల్ అన్సారి (20) స్థానిక పవర్ ప్రాజెక్టులో హెల్పర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే విధుల్లోకి వెళ్లి పనిచేస్తుండగా చేతులకు అంటిన గ్రీసును కడుక్కునేందుకు చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి మృతిచెందాడు. మృతుని సోదరుడు ఫిరోజ్ అన్సారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కొంగల కోలాహలం

రైతులు వరిసాగుకు సమాయాత్తం అవుతున్నారు. వరికయ్యలు తయారు చేసే క్రమంలో కొంగలు ఆహారాన్వేషణలో భాగంగా గుంపులుగా చేరి కనువిందు చేస్తున్నాయి. గురువారం వెంకటేశ్వరనగరం వద్ద పొలాల్లో పెద్ద ఎత్తున కొంగలు గుంపులుగా చేరి కీటకాలు, పురుగులను తింటూ ఆహారాన్వేషణ సాగిస్తున్నాయి. గతంలో నదులు, కాల్వల వెంట చేపల కోసం వెళ్లే కొంగలు ఇప్పుడు పొలాల బాట పట్టి కోలాహలం చేస్తున్నాయి. – దొర్నిపాడు



భళారే విచిత్రం

ప్రకృతిలో నిశితంగా పరిశీలిస్తే రాళ్లు, కొండలు, చెట్లు, గుట్టలు వంటివి కూడా విచిత్ర రూపాలకు నెలవులవుతుంటాయి. అలాగే ఇక్కడ ఎండిపోయిన మాను కాండాన్ని పరిశీలిస్తే పొడవాటి మెడ కలిగిన పులి తల రూపం కనిపిస్తోంది కదూ. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటిలో ఎకో – టూరిజం జంగిల్ క్యాంప్ ఆవరణలో ఈ ప్రకృతి శిల్పం కనిపిస్తుంది. అడవిలో ఎండిపోయిన మాను కాండం వద్ద ఈ రూపాన్ని గమనించిన నాగలూటి ఎఫ్ఆర్ఓ దొరస్వామి దాన్ని ఎకో – టూరిజం ఆవరణలో చేర్చి పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తున్నారు. – ఆత్మకూరురూరల్



గార్దభాల పరుగు పందెం

సంజామల మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో అంకాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గార్దభాల పోటీలు హోరాహోరీగా సాగాయి. నిర్ణీత పది నిమిషాల సమయంలో వెలుగోడు మండలం వేల్పనూరుకు చెందిన సురేంద్ర గార్దభాలు 5689 అడుగుల దూరం పరిగెత్తి విజేతగా నిలిచాయి. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి నగేష్ గార్దభాలు 5539 అడుగులు, ముక్కమల్ల అంజి గార్దభాలు 5537 అడుగులతో తరువాతి స్థానాల్లో నిలిచాయి. విజేత గర్దభాల యజమానులకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను నిర్వాహకులు అందజేశారు. – సంజామల

ఆరోగ్య రక్ష.. అయ్యప్ప దీక్ష

- కఠిన నియమాలే ఉన్నత జీవితానికి సోపానాలు
- దీక్షా నియమాలతో మానసిక ప్రశాంతత
- పాటిస్తే ఉత్తమ సమాజ నిర్మాణం
- దీక్షలో దాగి ఉన్న సైన్స్, ఆధ్యాత్మిక, తాత్విక గుణాలు
- ఉమ్మడి జిల్లాలో 30 వేల మందికి పైగా భక్తుల దీక్ష స్వీకరణ


మాల ధారణ చేస్తున్న పూజారి బాల స్వామి


సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న మాలధారులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి మాల ధరించి నియమాలను పాటిస్తూ స్వామియే శరణం అయ్యప్పా అని వేడుకుంటే స్వామివారు కరుణిస్తారని భక్తుల నమ్మకం. కార్తీక మాసం ప్రారంభం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్ప భక్తులు దీక్ష చేపడుతుంటారు. స్వామి దీక్ష.. క్రమబద్ధమైన జీవన విధానాన్ని నేర్పే భక్తి తత్వం. దురలవాట్ల నుంచి విముక్తి కల్పించి క్రమ శిక్షణ వైపు నడిపించే ఆధ్యాత్మిక మార్గం. మాలధారణ అంటేనే నియమాల తోరణం అన్న విషయం తెలిసినా దీక్ష తీసుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది భక్తులు దీక్ష స్వీకరించినట్లు అంచనా. దేహమే దేవాలయంగా 41 రోజులు అష్టరాగాలు, పంచేంద్రియాలు, త్రిగుణాలు, అవిద్యలకు దూరంగా బ్రహ్మచర్యం, చన్నీటి స్నానం, దీపారాధన, అయ్యప్ప శరణుఘోష, సాత్వికాహారంతో భక్తులు ముందుకు సాగుతున్నారు. దీక్షా సమయంలో పాటించే నియమాలను దీక్షానంతరం కూడా పాటిస్తే ఆరోగ్యంతో పాటు వ్యక్తిత్వ వికాసంతో ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుంది.

ఆరోగ్య రక్ష.. ఉత్తమ జీవన మార్గం..

అయ్యప్ప మాలధారణ నియమాలతో కూడుకున్నది. అయ్యప్ప దీక్ష నియంత్రణాత్మకం, ఆధ్యాత్మిక సోపానంగా భావిస్తూ పలువురు ఏటా దీక్షబూనుతారు. కాలక్రమేణా ఇదే రీతిలో భవానీ, శివ, హనుమాన్, సాయి, గోవింద, భరతమాత, పాండురంగడు దీక్షలు ప్రారంభమయ్యాయి. వస్త్రాల రంగుల్లో మార్పులున్నా.. దాదాపు అందరి నియమ, నిష్టలూ ఒకే పద్ధతిలో ఉంటాయి. మండల రోజులు జీవన యానం సాగిస్తారు. దీక్షా సమయంలో ఉదయం, సాయంత్రం నియమాలు పాటిస్తారు. బాహ్య ప్రపంచం ఒత్తిడిని ప్రతిరోజూ రెండు గంటల సేపు మరిచిపోతారు. వీటి వెనక ఆధ్యాత్మిక, తాత్విక, సైన్స్ కోణాలు దాగి ఉండటం విశేషం. ఇది ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుంది.

వస్త్రధారణ

ఆధ్యాత్మికం: అయ్యప్ప భక్తులు నల్లటి వస్త్రాలు ధరిస్తారు. ఈ దుస్తులు ధరించిన వారిపై శని దేవుని చూపు పడదని భక్తుల విశ్వాసం.

తాత్వికం: నలుపు ఆకర్షణకు దూరంగా ఉండి అన్ని ఇహపర సుఖాలను త్యజించమని చెబుతుంది.

వైజ్ఞానికం: నలుపు రంగుకు ఉష్ణాన్ని గ్రహించే శక్తి ఉంటుంది. దేహ ఉష్ణోగ్రతను దీక్ష ఉపవాసాలు తగ్గించేస్తాయి. ఈ దుస్తులు ఉష్ణాన్ని సమతుల్యం చేస్తాయి.

భూతల శయనం.. సుఖం

ఆధ్యాత్మికం: భూమి తల్లితో సమానం. నేలపై పడుకుంటే దేవుడి ఒడిలో పడుకున్నట్లే.

తాత్వికం: హంస తూళికా తల్పాలు ఇవ్వలేని మనశ్శాంతి, సుఖం భూశయనం ఇస్తుందనేది ప్రాచీనుల విశ్వాసం. మనుసు మొత్తం కకావికలం అయినప్పుడు భూమి మీద నిశ్చలంగా కొద్దిసేపు పడుకుంటే అన్నీ దూరమవుతాయని యోగశాస్త్రం చెబుతుంది.

వైజ్ఞానికం: ప్రతి వస్తువుకు కొంత సర్క్యూట్‌లో శక్తి కిరణాలు ఉంటాయని విజ్ఞాన శాస్త్ర ప్రతిపాదన. సమాంతర స్థితిలో శక్తి మార్పిడి పొందుతుంటుంది. ఇది శరీరానికి శక్తినిస్తుంది.

మితాహారం..

ఆధ్యాత్మికం: మితాహారమే ఆరోగ్యం. మితాహారం తీసుకోవడం ద్వారా కొవ్వు శరీరంలో చేరేందుకు ఆస్కారం ఉండదు.

తాత్వికం: ఒక్కపూట భోజనం, ఒక్క పూట అల్పాహారం తీసుకోవడం ద్వారా శరీరం తేలికగా ఉంటుంది. బద్ధకం దరి చేరకుండా రెట్టింపు ఉత్సాహంతో పరుగెత్తేందుకు వీలుంటుంది.

వైజ్ఞానికం: మితాహారంతో మధుమేహం దూరం అవడమే కాకుండా కొవ్వు పదార్థాల నుంచి గుండెను కాపాడుకోవచ్చు.

పాదరక్షలు లేకుండా..

ఆధ్యాత్మికం: పాదరక్షలు అపరిశుభ్రతకు చిహ్నం. వీటిని ధరించకూడదు.

తాత్వికం: శబరిమల వెళ్లేది అడవి మార్గంలోనే. కొండ రాళ్ల మధ్యన పాదరక్షలు లేకుండా వెళ్లేందుకు ఇక్కడి నుంచే అలవాటు అవుతుంది.

వైజ్ఞానికం: భూమికి ఉష్ణోగ్రత, అయస్కాంత తత్వం ఉంటాయి. పాదాలు నేరుగా భూమిని స్పర్శిస్తుండటంతో భూ స్థితికి తగిన రీతిలో రక్త ప్రసరణలు, హృదయ స్పందనలు సమవుతాయి.


మణికంఠ అయ్యప్పస్వామి

జీవన ప్రమాణాలు పెరుగుతాయి



అయ్యప్పస్వామి మాల ధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తమ విధిని గుర్తిస్తారు. సంఘజీవిగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలో అలవర్చుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహ భావం పెంపొందుతుంది. నడవడిక మెరుగుపడి ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుంది.
– సత్యనారాయణ, గురుస్వామి

ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుంది



దీక్ష స్వీకరించినన్ని రోజులు జీవన విధానంలో ప్రత్యేకత ఉంటుంది. నియమ నిష్టలతో నిత్యం అయ్యప్పను సేవించడం, ఉదయం, సాయంత్రం ఆలయానికి వెళ్లడం వల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత కలుగుతోంది. ప్రతిఒక్కరితో ప్రశాంత చిత్తంతో మాట్లాడటం, పూజలు, భజన కార్యక్రమాల్లో పాలు పంచుకోవటంతో మనసుకు ప్రశాంతంగా ఉంటుంది. దీక్షా పరులు కఠినమైన నియమ నిబంధనలను తుచ తప్పకుండా పాటిస్తే ఉత్తమ జీవన విధానంలో పయనిస్తాం.
– భూషణ్ గౌడ్, గురుస్వామి, 17వ పడి

అనుమానాస్పద స్థితిలో తల్లీకుమార్తె మృతి

- ఆరు నెలల గర్భిణి, మూడేళ్ల చిన్నారి మృతితో విషాదం
- విచారణ చేపట్టిన పోలీసులు


మృతి చెందిన పింజరి సలీమా, సమీర

హొళగుంద: హెబ్బటంలో గురువారం ఘోరం జరిగింది. ఏమైందో గానీ తల్లీ, మూడేళ్ల కూతురు అనుమానాస్పదస్థితిలో మరణించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంగళదహాల్‌కు చెందిన సలీమా (20)ను నాలుగేళ్ల క్రితం నందవరం మండలం హాలహర్వికి చెందిన సక్కరప్పకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి మూడేళ్ల కూతురు సమీర ఉంది. రెండేళ్ల క్రితం సక్కరప్ప తల్లి మాబున్ని, భార్య, కూతురుతో కలిసి హెబ్బటం గ్రామానికి వచ్చి ఇక్కడే స్థలం కొని రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ స్థితిలో గురువారం సక్కరప్ప పొలానికి, అతని తల్లి కూలి పనికి వెళ్లగా, ఆరు నెలల గర్భిణి అయిన సలీమా, మూడేళ్ల చిన్నారి ఇంట్లో ఉన్నారు. పొలానికి వెళ్లిన వారు సాయంత్రం ఇంటికి రాగా సలీమా, చిన్నారి సమీర ఇంట్లో నేలపై విగత జీవులుగా పడి ఉన్నారు. సలీమా కూతురికి ఉరి వేసి, తానూ ఉరి వేసుకుని చనిపోయిందని సక్కరప్ప ఇంగళదహాళ్‌లో ఉంటున్న అత్తకు, స్థానికులకు చెప్పాడు. ఎస్ఐ బాల నరసింహులు, సిబ్బంది గ్రామంలో విచారణ చేపట్టారు. ఆలూరు సీఐ వెంకటచలపతి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి తల్లి మాబీ తన కూతురు, మనవరాలిని అల్లుడే చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా వాస్తవం వెలుగులోకి వస్తుందని ఎస్ఐ తెలిపారు.

ఆ అడుగులు కుక్కలవే !



పొలాల్లో పాదముద్రలను పరిశీలిస్తున్న డీఆర్ఓ

పాణ్యం: అహల్యాపురంలో పెద్దపులి సంచరిస్తోందని ప్రచారం జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్న క్రమంలో గురువారం అటవీశాఖ అధికారులు గ్రామంలో పర్యటించారు. పాణ్యం డీఆర్ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలోని పొలాలు, రస్తాల వెంట పర్యటించారు. పొలాల్లోని పాదముద్రలను పరిశీలించి అవి కుక్కల పాదముద్రలని నిర్ధారించారు. అలాగే మరికొన్ని పాదముద్రలను గుర్తించిన అధికారులు అవి దుప్పుల అడుగులని తేల్చారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాము పరిశీలించిన పాదముద్రలు పెద్దపులి, చిరుతవి కాదని స్పష్టం చేశారు. ప్రజలు నిర్భయంగా పొలాలకు వెళ్లి పనులు చేసుకోవచ్చని సూచించారు. సిబ్బంది జమాల్‌వలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సత్రం పేరుతో నకిలీ వెబ్‌సైట్

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పద్మశాలి నిత్యాన్నదాన సత్రం పేరిట సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్‌ను తయారుచేసి ఆన్‌లైన్‌లో రూములు బుక్ చేస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సత్రం ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖరుడు గురువారం తెలిపారు. పద్మశాలి సత్రానికి ఎలాంటి ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం లేదని స్పష్టం చేశారు. నకిలీ వెబ్‌సైట్‌ను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని భక్తులకు సూచించారు. గదుల బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించి ఉంటే సత్రానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సోనిబాయి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో గురువారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మంగేనాయక్ భార్య సోనిబాయి (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోనిబాయి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు గమనించి చూడగా అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించగా సోనిబాయి అనారోగ్యంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

విషవాయువు పీల్చి ఐదుగురికి అస్వస్థత

- పుట్టగొడుగుల పరిశ్రమలో డ్రైనేజీని శుభ్రం చేస్తుండగా ఘటన
- ఇద్దరి పరిస్థితి విషమం, కోలుకుంటున్న ముగ్గురు బాధితులు


అస్వస్థతకు గురైన వేణుగోపాల్


ప్రమాదానికి కారణమైన డ్రైనేజీ

ఓర్వకల్లు: విషవాయువు బారినపడి ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన కాల్వబుగ్గ సమీపంలోని పుట్టగొడుగుల పరిశ్రమలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన బరూన్ మండేల, హుసేనాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ, వేణుగోపాల్, సుబాన్‌బాష, అరుణ్‌కుమార్ గత కొద్ది నెలలుగా కాల్వబుగ్గ సమీపంలోని పుట్టగొడుగుల పరిశ్రమలో పనిచేస్తున్నారు. పరిశ్రమలో యంత్రాల నుంచి వచ్చే వ్యర్థాలు బయటకు వెళ్లేలా ఐదు అడుగుల లోతు డ్రైనేజీ ఉంది. గురువారం ఉదయం 11 గంటల సమయంలో డ్రైనేజీలో మురుగు ప్రవాహానికి వరిగడ్డి అడ్డుపడింది. బరూన్ మండేలా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను తొలగించి లోపలికి దిగి శుభ్రం చేసే క్రమంలో దుర్గంధభరితమైన విషవాయువును పీల్చడంతో స్పృహ కోల్పోయి కాల్వలో పడిపోయాడు. గమనించిన వేణుగోపాల్ అతన్ని పైకి తీసే ప్రయత్నంలో అస్వస్థతకు గురయ్యాడు. వారిని కాపాడే క్రమంలో వెంకటరమణ, సుబాన్‌బాష, హరీష్‌కుమార్ విషవాయువు ప్రభావానికి లోనై అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే ఓర్వకల్లు సీహెచ్‌సీకి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించిందని, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి బరూన్ మండేల, వేణుగోపాల్ పరిస్థితి విషమంగా ఉందని, మిగతా ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్లు పరిశ్రమ సిబ్బంది చెప్పారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

విషవాయువు ప్రభావానికి లోనై తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం కార్మికులకు భద్రత మెరుగుపరిచి, ప్రమాద బీమా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణుడు, శేఖర్, శాలుబాష తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో అద్దెకు చేరి యజమానిపై కోర్టులో కేసు

- యజమాని, భార్య ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యంగా పోస్ట్ చేస్తామని హెచ్చరికలు
- ప్రాణహాని ఉంది కాపాడమని వేడుకున్నా పట్టించుకోని పోలీసులు
- ఆత్మహత్య చేసుకుంటామని ఆర్యవైశ్య దంపతుల సెల్ఫీ వీడియో


ఆత్మహత్య చేసుకుంటామని చెబుతూ సెల్ఫీ వీడియో తీసుకున్న నాగరాజు కుటుంబం

బొమ్మలసత్రం: నంద్యాలలో పోలీసుల తీరుతో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడాలనే నిర్ణయం తీసుకుని సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం సంచలనంగా మారింది. తమకు రక్షణ లేని చోట బతకటం వృథా అని చెబుతూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమైన వీడియో అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. వివరాలు.. నంద్యాల ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన నాగరాజు రెండేళ్ల క్రితం తన స్థలంలో నాలుగు దుకాణాలు నిర్మించుకున్నాడు. అందులో భార్యతో కలిసి నిత్యావసర సరుకుల దుకాణం నడుపుతున్నాడు. ఖాళీగా ఉన్న మరో రెండు దుకాణాలను పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్న రాఘవేంద్రప్రసాద్ చిన్న కుమారుడు అరుణ్‌కుమార్‌కు గతేడాది సెప్టెంబర్ 20న అద్దెకు ఇచ్చాడు. అద్దె సక్రమంగా చెల్లించక పోవటంతో దుకాణాన్ని ఖాళీ చేయమని నాగరాజు ఆదేశించారు. అయితే 2022 మే 4న దుకాణాన్ని మూడేళ్లపాటు అద్దెకు తీసుకున్నట్లు తప్పుడు పత్రం సృష్టించడమే గాకుండా, ఇప్పుడు తనను బెదిరిస్తూ అరుణ్‌కుమార్ కోర్టు నోటీసు పంపాడని బాధితుడు నాగరాజు వాపోయారు. ఇంతటితో ఆగక తన దుకాణంలోకి వెళ్లనివ్వకుండా అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్, రాఘవేంద్రప్రసాద్ అడ్డుకుంటున్నారని సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. కర్రలతో బెదిరింపులకు దిగడంతో పాటు తన భార్యను అసభ్యకరంగా తిడుతున్నారని,బయటి వ్యక్తులను పిలిపించి భయాందోళనకు గురిచేస్తున్నారని వివరించాడు. వారి అకృత్యాలపై పోలీసులకు విన్నవించుకోగా కోర్టులో ఉన్న సమస్యకు తాము పరిష్కారం చూపలేమంటూ దాటవేస్తున్నారని పేర్కొన్నాడు. దీంతో న్యాయం జరగదని భార్య, కుమారుడితో కలిసి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటామంటూ నాగరాజు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఆ వీడియో గురువారం బయటికి రావటంతో ఆర్యవైశ్య నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కోడుమూరు రూరల్: మండలంలోని రామాపురం గ్రామంలో చాకలి సుంకన్న భార్య హైమావతి (40) అత్తింటివారి వేధింపులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైమావతిని అత్త సుంకులమ్మ, మరిది వెంకటరాముడులు సూటిపోటి మాటలు మాట్లాడుతూ భర్తతో కాపురం చేసుకోనివ్వకుండా వేధించేవారు. విసుగు చెందిన హైమావతి గత నవంబర్ 24న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతిచెందింది. మృతురాలి తల్లి చాకలి చిన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

తిక్క తిక్కగా మాట్లాడొద్దు !

- వీరభద్రగౌడ్‌పై విరుచుకుపడిన పత్తికొండ ఎమ్మెల్యే

దేవనకొండ: నా గురించి దుష్ప్రచారం చేస్తున్నావ్.. ఇక నైనా తగ్గించుకో.. తిక్కతిక్కగా మాట్లాడితే బాగుండదు.. అని ఆలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్‌ను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన దేవనకొండలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరభద్రగౌడ్‌పై విరుచుకుపడ్డారు. ఆయన మాట్లాడుతూ..'తనవల్లే ఎన్నికల్లో ఓడిపోయానని నిందలు వేస్తుండటం సరికాదన్నారు. నీ చరిత్ర అంతా తన వద్ద ఉందని, ఎవరితో ఎంత తీసుకుంటున్నావు, ప్రతి పనికి రేటు కడుతున్నావని, వీరభద్రగౌడ్ గెలిస్తే శ్యాంబాబుకు మంత్రి పదవి రాదని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నా'రు. కాగా.. ప్రస్తుతం ఆలూరు ఇన్‌చార్జ్‌గా ఉన్న వీరభద్రగౌడ్ కార్యక్రమానికి హాజరు కాలేదు. అయితే వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ హాజరయ్యారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం శివప్రసాద్ జ్యోతి అని శ్యాంబాబు ప్రకటించడంతో కార్యకర్తలు ఒక్కసారిగా అవాక్కయ్యారు.